క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్వో కార్యాలయ సిబ్బందికి చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం లక్ష విరాళాన్ని నగరంలోని శాంతిపురానికి చెందిన చిన్మయినంద సాహిత్య అనే దాత అందజేశారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుకు అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరాహ నరసింహం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరిపై గురువారం సాయంత్రం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆనందపురం మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన శ్రీ గంగాదేవి కోలాట బృందానికి చెందిన మహిళలు పలు భక్తిగీతాలకు శిరస్సులపై బిందెలు పెట్టుకొని అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

అనారోగ్యంతో సబ్బవరం ఏఎస్ఐ మృతి

దహన ఖర్చులకు రూ.10 వేల అందజేత



మృతుడు రామునాయుడు కుమారుడికి నగదు అందిస్తున్న దృశ్యం

కె.కోటపాడు/సబ్బవరం: సబ్బవరం ఏఎస్ఐ గొర్లె రామునాయుడు(59) అనారోగ్యంతో స్వగ్రామం కె.కోటపాడు మండలం కె.జె.పురంలో బుధవారం రాత్రి మృతి చెందారు. 2021లో బదిలీపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం క్యాన్సర్ సోకడంతో కొంత కాలంగా చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మరణించారు. గురువారం అతడి మృతదేహానికి పూలమాల వేసి సబ్బవరం ఎస్ఐ ఆర్.ధనుంజయ్ ఘన నివాళులర్పించారు. పోలీస్ లాంఛనాలతో సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి దహన ఖర్చుల నిమిత్తం ఎస్ఐ రూ.10 వేలు అందించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

దొంగతనాల కేసులో ఇద్దరికి జైలు శిక్ష

పరవాడ: పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దొంగతనం కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ అనకాపల్లి 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.రమేష్ తీర్పు చెప్పారని సీఐ ఎస్.బాల సూర్యారావు తెలిపారు. మామిడి తిరుపతిరావు అనే వ్యక్తికి ఆర్నెల్లు జైలు శిక్ష విధించారు. అలాగే ముత్యాలమ్మపాలెంలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన తిక్కాడ నూకరాజుకు 4 నెలలు జైలు శిక్ష విధించారు.
- ముత్యాలమ్మపాలెం కొట్లాట కేసులో అదే గ్రామానికి చెందిన బొంది పెంటయ్యపై నేరం రుజువు కావడంతో అతనికి రూ.8 వేల జరిమానా విధిస్తూ అనకాపల్లి 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.రమేష్ గురువారం తీర్పు చెప్పారని సీఐ బాలసూర్యారావు తెలిపారు.

26 మద్యం బాటిళ్ల పట్టివేత

సబ్బవరం: స్థానిక మూడు రోడ్లు కూడలిలో గురువారం సాయంత్రం ఒక వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 26 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సబ్బవరం మూడు రోడ్లు కూడలిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సబ్బవరంలోని సాయి నగర్ కాలనీకి చెందిన తాటిపాముల మణికంఠ అనే వ్యక్తిని మద్యంతో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.3.900 వరకూ ఉంటుందన్నారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, సిబ్బంది ఆర్కే నాయుడు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు



అడవివరం ఎంపీపీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి



అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ సూరినాయుడు, వైస్ చైర్మన్ తులసి, సభ్యులు

సింహాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. దాదాపు అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 98వ వార్డు పరిధి అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. చైర్మన్‌గా సూరినాయుడు, వైస్ చైర్మన్‌గా ఆర్.తులసి ఎన్నికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు తెలిపారు.
- అడవివరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అమలాపురం లక్ష్మి, వైస్ చైర్మన్‌గా బి.భవాని ఎన్నికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు.
- సింహాచల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా డి.శివకృష్ణ, వైస్‌చైర్మన్‌గా పి.భవాని ఎన్నికై నట్టు ప్రధానోపాధ్యాయుడు సన్యాసినాయుడు తెలిపారు.
- పాత అడవివరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కె.భానుశ్రీ, వైస్ చైర్మన్‌గా టి.అలేఖ్య ఎన్నికై నట్టు ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు తెలిపారు.



సింహాచల్‌నగర్‌లోని ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రధానోపాధ్యాయుడు సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు

అధినేతతో పరవాడ నాయకులు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పరవాడ నేతలు

పరవాడ/సబ్బవరం: వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి ప్రతీ నాయకుడు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని పరవాడ ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, పార్టీ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి పార్టీ నేతలు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గెలుపే లక్ష్యంగా చేయాలని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు చెప్పారు.



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెందుర్తి: కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు విన్నవించారు. ఈ మేరకు సీతమ్మధారలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

బల్ల శ్రీనివాసరావుకు అభినందన

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన జీవీఎంసీ 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావును పంచకర్ల ప్రత్యేకంగా అభినందించారు. జీవీఎంసీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి అధికంగా నిధులు తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు.



పంచకర్లకు వినతిపత్రం అందిస్తున్న కల్లు గీత కార్మిక సంఘం ప్రతినిధులు

సింహగిరిపై నేడు లక్ష కుంకుమార్చన



పుష్పాలంకరణలో సింహవల్లీతాయారు సన్నిధి

సింహాచలం: శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీతాయారు సన్నిధిని గురువారం ముస్తాబు చేశారు. పలు రకాల పుష్పాలు, మామిడి ఆకులతో అమ్మవారితో ఆళ్వార్ సన్నిధిని తీర్చిదిద్దారు. ఆలయంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు.

బాబోయ్ భౌ



పరవాడ మెయిన్‌రోడ్డుపై సంచరిస్తున్న వీధి కుక్కలు

పరవాడ: పరవాడ గ్రామంలో వీధి కుక్కల బెడద మరింత పెరుగుతోంది. వీధి కుక్కల నిర్మూలనకు ఇటీవల పంచాయతీ అధికారులు శ్రీకారం చుట్టి కొన్ని కుక్కలను వలపన్ని పట్టుకొని శస్త్ర చికిత్సల నిమిత్తం తరలించారు. గ్రామంలో రెండు దఫాలుగా కేవలం వందలోపు కుక్కలను మాత్రమే పట్టుకోగలిగారు. ఇంకా వందల సంఖ్యలో గ్రామ సింహాలు సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. పుర వీధులు, మాంసం, చేపల మార్కెట్లు, మెయిన్ రోడ్లపై పదుల సంఖ్యలో సంచరిస్తున్న గ్రామ సింహాలను చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లపై నిత్యం పదుల సంఖ్యలో సంఖ్యలో తిరుగుతున్న వీధి కుక్కలు ద్విచక్ర వాహనదారుల వెంట పడుతూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి వేళ ప్రజలు ఇళ్లు వదిలి బయటకు రావడానికి భయపడుతున్నారు. గ్రామ సింహాలు ఒక చోటికి చేరి అరుపులు కేకలతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రజలు నైట్‌హాల్ట్ బస్సులు దిగి ఇళ్లకు చేరడానికి భయపడుతున్నారు. ప్రజలను హడలెత్తిస్తున్న వీధి కుక్కల నిర్మూలనకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు.ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణసంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి కల్యాణ క్రతువు ప్రారంభించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

పరారీలో ఉన్న వ్యక్తి అరెస్టు

సబ్బవరం: గంజాయి కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. సీఐ అందించిన వివరాలు .. 2022 జూలై 14న అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై అసకపల్లి సమీపంలోని గణపతిపురం వద్ద 100 కిలోల గంజాయి,8 కిలోల లిక్విడ్ గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. జి. మాడుగుల ఏజెన్సీ ప్రాంతం నుంచి సబ్బవరం మీదుగా కేరళ తరలిస్తుండగా పట్టుబడిన గంజాయితో పాటు ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు.ఈ కేసులో మరో ఇద్దరు వ్యక్తులు తప్పించుకుపోయారన్నారు. పరారైన 7వ వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేసికోర్టుకు తరలించినట్టు చెప్పారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి



సత్యనారాయణ(ఫైల్)

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు.సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు ..గ్రామానికి చెందిన పైల సత్యనారాయణ(54) కొన్నేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ మనోవ్యథకు గురవుతున్నాడు.ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. అతడి కుమారుడు మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉత్పత్తికి సరిపడా ముడిసరకు అందివ్వాలి



దీక్షా శిబిరంలో బెంగాల్ మాజీ సీఎం భట్టాచార్యకు నివాళులర్పిస్తున్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి విఘాతం కలగకుండా సరిపడా ముడిసరకు అందివ్వాలని ఉక్కు పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1274వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో చెల్లించిందన్నారు. మూడున్నర సంవత్సరాలుగా కార్మికులు తమ నిరసన వ్యక్తం చేస్తుంటే చీమకుట్టినట్టు కూడా కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో యు.రామస్వామి, ఉరివిటి మరిడయ్య పాల్గొన్నారు.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రికి నివాళి

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటని సిటు నాయకులు ఎస్.రామారావు, శ్రీనివాసరాజు అన్నారు. దీక్షా శిబిరంలో ముందుగా భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భట్టాచార్య 11 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి అక్కడి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. బెంగాల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపించిన ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కె.గంగాధర్, కె.వి. సత్యనారాయణ, బి.మహేష్, పెదిరెడ్ల నీలకంఠం, రామచంద్రమూర్తి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదులో అలసత్వం వద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

సబ్బవరం: ఈ పంట నమోదులో అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ సమావేశమందిరంలో గురువారం గ్రామ వ్యవసాయ సహాయ,ఉద్యాన సహాయకులు,గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల రైతుల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలన్నీ ఈ పంటతో ముడిపడి ఉన్నాయన్నారు. తగిన జాగ్రత్తలు వహించి ప్రతి వ్యవసాయ భూమిలో ఉన్న పంట వివరాలను నమోదు చేయాలని సూచించారు.

డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ– పంటను జాయింట్ అజమాయిషీ పద్ధతిలో వ్యవసాయ,రెవెన్యూ శాఖల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రోజువారీ ప్రణాళిక ప్రకారం ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ వీఏఏలు, పోతల అలేఖ్య,బొబ్బరి లావణ్య,ఆర్ఐ వీరయ్య,వీఆర్వో రామకాసు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

సబ్బవరం : అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల /కళాశాలల్లో పలు సబ్జెక్టుల్లో బోధించడానికి ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్, నకలు ధ్రువపత్రాలతో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమో తరగతులకు హాజరుకావాలన్నారు. ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా బాలుర పాఠశాలలకు పురుష అభ్యర్థులకు, బాలికల పాఠశాలకు మహిళా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని, విద్యా బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి కార్యాలయంలో, ఫోన్ :0891 2799641 నంబర్‌లో సంప్రదించాలన్నారు. దేవరాపల్లి బాలుర గురుకుల పాఠశాలలో జేఎల్ తెలుగు, కొక్కిరాపల్లి బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ జువాలజీ, కోనాం బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ కెమిస్ట్రీ , నర్సీపట్నం బాలికల గురుకులంలో పీజీటీ సోషల్ సబ్జెక్టు పోస్టులతో పాటు గొలుగొండ బాలుర గురుకులంలో పీడీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

జీవ వైవిధ్యం పరిరక్షణపై పోటీలు

అగనంపూడి: జిల్లా విద్యా శాఖ, ఏపీఎస్‌జీసీ అనకాపల్లి సంయుక్తంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జీవ వైవిధ్యం పరిరక్షణపై పాఠశాలల్లో పోటీలు నిర్వహించాలని ఏపీఎస్‌జీసీ జిల్లా కో ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు సూచించారు. లంకెలపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలలు, ప్లస్ టూ పరిధిలోని 8 నుంచి 12వ తరగతుల్లోపు బాలలకు పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, మూడు నిమిషాల నిడివిలో షార్ట్ ఫిల్మ్ త యారు చేసి ప్రదర్శించాల్సి ఉంటుందన్నా రు. మండల స్థాయిలో ముందుగా పోటీ లు నిర్వహించాలని, ఒక్కో విభాగం నుంచి ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో విద్యార్థి మాత్రమే పాల్గొనాల్సి వుంటుందని ఆయ న తెలిపారు. విజేతలకు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, క్లస్టర్ కో ఆర్డినేటర్ బుడుమూరు అన్నాజీరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి పుట్టి పండగ



అగనంపూడిలోని షిర్డీ సాయి ఆలయంలో సుప్రభాత సేవలో భక్తులు

అగనంపూడి: సత్యసాయి బాబా పుట్ట పండగ (99 రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమం)ను పురస్కరించుకొని అగనంపూడిలోని షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం ఘనంగా ఓంకార జపం, సుప్రభాత సేవ, నగర సంకీర్తన నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సత్యసాయి, షిర్డీసాయి బాబా భక్తులు అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీల్లో భజనలు చేశారు. ఓంకార స్మరణతో ప్రారంభమైన కార్యక్రమంలో సుప్రభాత సేవ నిర్వహిస్తుండగా, మరోవక్క సత్యసాయి గీతాలాపనతో నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి అగనంపూడి కన్వీనర్ విందుల పైడినాయుడు, బి.వి.సుబ్బారావు, షిర్డీసాయి మందిర కమిటీ చైర్మన్ కొయ్య రమణారెడ్డి మాట్లాడుతూ హైందవ ధర్మ ప్రచారం, ఆధ్యాత్మికతను స్థానికుల్లో పెంపొందించేందుకు స్థానికంగా ఉన్న ఆలయ కమిటీలతో సంయుక్త కార్యక్రమాలు చేపడితే మంచిదన్నారు. కార్యక్రమంలో ధర్మాల వ్యాసశర్మ, విందుల వరహాలు, పి.సత్యనారాయణ, పీఎల్ఎన్‌రాజు, కిషోర్, ఈశ్వరరావు, గణేష్, రామన్, జయ, రమణమ్మ, కళా, డి.సత్యలక్ష్మి, పంకజ, పద్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. వేతనాల అంశంపై సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్లాంట్ కోసం పని చేస్తున్న ఉద్యోగులకు నేటికీ జీతాలు చెల్లించకపోవడం యాజమాన్యం అసమర్థతకు నిదర్శనమన్నారు. పని చేస్తున్న ఉద్యోగులకు ప్రతీ నెలా 1న జీతాలు చెల్లించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. పన్నులు, జీఎస్టీలు, కరెంటు బిల్లులు వంటివి సకాలంలో చెల్లిస్తూ... ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ పూర్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడిపితే లాభాల బాట పడుతుందన్నారు. ప్రభుత్వం సహకరించి అవసరమైన రా మెటీరియల్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.శ్రీనివాస్, సన్యాసిరావు, శ్రీనివాసరాజు, పుల్లారావు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.47 వేల జరిమానా

పెందుర్తి: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 22 మందికి 2వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు గురువారం తెలిపారు.పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మంది పట్టుబడ్డారన్నారు.వీరిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికీ రూ.1,500 నుంచి రూ. 3,500 వరకూ జరిమానా విధించినట్టు తెలిపారు. 22 మందికి కలిపి రూ.47 వేలు జరిమానా విధించారన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాలాక్షినగర్ గీతాంజలి సామాజిక భవనం ఎదురుగా సాయిశ్రీ రెసిడెన్సీలోని ఒక ఫ్లాట్‌లో శ్రీనివాసరావు దంపతులు నివసిస్తున్నారు. శ్రీనివాసరావు ఏయూలో ఉద్యోగి. ఆయన భార్య ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. వారిద్దరు గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లిన కొంత సేపటికి ఆ ఫ్లాట్ నుంచి పొగలు బయటకు వచ్చాయి. స్థానికులు గమనించి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని భావించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే ఫ్లాట్‌లోని బీరువాలు, మంచాలు, దుస్తులు తదితర సామగ్రి కాలిపోయి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు ఇంటి వద్దకు చేరుకొని సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా శ్రీనివాసరావు భార్య దేవుడి గదిలో పూజ చేసే సమయంలో దీపం వెలిగించి అనంతరం డ్యూటీకి వెళ్లడంతో దాని మంట ఎగిసిపడి సమీపంలో ఉన్న దేనినైనా అంటుకోవడం వల్ల ప్రమాదానికి కారణమై ఉంటుందని కొందరు భావిస్తున్నారు. తాము ఇంట్లో ఉన్న సమయంలోనే దీపం ఆరిపోయిందని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చీ



రికార్డులు పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చీ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి సందర్శించారు. కంచరపాలెం పీఎస్ పరిధిలో పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి సీపీ సూచించారు. స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అదే పోలీస్ స్టేషన్‌లో మేడపైన ఉన్న కంచరపాలెం, ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్లను పోలీస్ కమిషనర్ సందర్శించారు. జీడీ ఎంట్రీ బుక్‌ను పరిశీలించిన ఆయన పుస్తకంలో ఎందుకు వారి వారి ఎంట్రీలను నిర్వహిండం లేదని, వారి కదలికలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో అక్కడ నుంచే క్రైం డీసీపీ వెంకటరత్నంతో ఫోన్‌లో సీపీ మాట్లాడారు. పలు విషయాలు అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రైం అధికారులు, సిబ్బంది ఏ సమయానికి వస్తున్నారు, ఏ సమయానికి వెళ్తున్నారో కూడా నమోదు చేయకపోవడంతో వారిపై సీపీ అసహనం వ్యక్తం చేశారు. క్రైం విభాగంలో విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.